# సంస్కరణ వివాహములు

శ్రీమతి వెలిదండ చూడికుడుతమ్మగారు

సీతారామశాస్త్రి పేరుపడ్డ ఎలెక్ట్రికల్ ఇంజనీయరు. సంస్కారి. అతనిని ఎవరైనా అకస్మాత్తుగ చూచిమాడగానే గొప్ప మేధావంతుడనియు, ఉదారమైన ఉన్నతవంశీకుడనియు చప్పున తట్టకమానదు. ఆయనభార్య రామలక్ష్మమ్మయు భర్తకుతగిన భార్య యని అనిపించుకొనుటకు ఏమాత్రము తీసిపోదు. విద్యావిషయములోనేమి, యుక్తాయుక్త విచక్షణలందేమి, నైతికకట్టుబాటుల దృఢత్వమునందేమి, ఆమెబుద్ధి పదును పెట్టినకత్తి. అంత ఐశ్వర్యవంతులైనను ఎప్పుడునూ ఏదో ఒక సత్కార్మయందే మనస్సును లగ్నపరుచుకుంటూ తనకన్న తక్కువవాని, పేదవాని, తల్లివలె చూచుటకు ఎల్లప్పుడూ, ప్రయత్నించుచుండును. రాజమహేంద్రవరమునందు ఈ దంపతులను చూచి పూజ్యభావముతో సంతోషించనివారులేరు. కారణము, వీరి పవిత్రప్రవర్తనమే. వీరి మూలమున లోకమునకు ఒక పవిత్రసందేశమును తెలియబరచుటకేమో అన, భగవంతుడు కుమార్తెలనే ఇద్దరిని ఇచ్చినాడు. కాని చూచినవారందరూ 'అయ్యో వంశానికి ఒక మగచిన్నవాడు లేక పోయెనా' అని విచారించేవారు. ప్రాప్తలాభ సంతుష్టి పరులగు వీరుమాత్రము కలలోగూడ అట్టి కించను పెట్టుకున్నట్టు కనబడదు.

ఆదివారము మధ్యాహ్నము భోజనములైన తరువాత ప్రసంగవశాత్తు రామలక్ష్మమ్మ భర్తనుచూచి, 'మన సరళమ్మనుగూర్చి నేచెప్పినది ఏమాలోచించినారు? స్కూలుఫైనలుపరీక్ష ప్యాసుచేసినది. మీ మేనల్లుడు మీకు తగినఅల్లుడనిపించుకొనుటకు అన్ని విధములా తగియున్నాడు. అమ్మాయికి కూడా అతన్నిగూర్చి మంచి అభిప్రాయమున్నది. వాళ్ళ తండ్రి తాతలు చాలా మంచివారు. అతను 25 ఏండ్లు పూర్తిగా నిండకమునుపే యం. యస్‌సి. ప్యాసు చేసి, కాలేజీకంతటికీ గౌరవము తెచ్చినవాడనియు, బుద్ధిమంతుడు తెలివైనవాడనియు గొప్పపేరు ప్రతిష్ఠలను సంపాదించినాడు. మీ మేనల్లునిగూర్చి మీకు మాత్రము తెలియదా ఏమి!' యనెను.

శాస్త్రి:—ఏమంత తొందర. అమ్మాయి బి. ఏ. మట్టుకైనా ప్యాసుచేసిన తరువాత ఆలోచించవచ్చును. అదిగాక, అమ్మాయిని ఏమైనా కదిపావా? లేక నీవే అల్లివేయుచున్నావా పన్నమంతాను.

రామలక్ష్మి:-మీ రలా అంటారని నాకు మొదటే తెలుసును. ప్రస్తుతకాలాన్ని పుచ్చుకుని మీ రలా ఉపేక్షవహిస్తారు. కాని నూతనానురాగవల్లికలు అంకురించే తరుణానికి ఒక అవలంబనమను నిర్ధారణ ఏర్పడిననే తప్ప, ఆవల్లికలు చెల్లాచెదరై మొరడు తేరి వాటి సౌందర్యమును పోగొట్టుకొనుట సహజము. కేవలము పరమయోగినులుగా ఉన్నవాళ్ళ విషయములో తప్ప, మొత్తముమీద నూటికి 99 పాళ్ళు ఈ రకములో చేరక తప్పని చాపతులే.

శాస్త్రి:—ఏమిటో ఆర్డరుగా మాటాడుచూ, తప్పదని అంటున్నావే. ఎంతమంది కన్యకలు ఇచ్చవచ్చినన్నాళ్లు అవివాహితలుగా ఉండి స్వేచ్ఛను అనుభవించటంలేదు.

రామలక్ష్మి:—నే ననటంలో అర్డరుగా ఏం కనబడిందో నాకు బోధపడటంలేదు. సముద్రమునకు తరంగాలు ఉండుననడంలోను, అగ్నిహోత్రుడు వేడిగాఉండు ననడంలోను ఎంత అస్వాభావికమో నేను తప్పదనటంలోకూడా అంత అస్వాభావికమే! సరేగాని ఇప్పు డెందుకంత అనవసరప్రసంగము నాకు. పిల్లకు యుక్తవయస్సువచ్చిన తరువాత వివాహము చేస్తేమాత్రము వచ్చిన నష్టమేమిటో నాకు తెలియకుండా ఉన్నది. ఎరిగున్న సంబంధము, తగినసంబంధము అయినప్పుడు వివాహము చేస్తే

మాత్రమున్నూ విద్యకు భంగం కావలసిన అవసర మేమిటి? విద్య మహాసముద్రము. అవకాశ మున్నంతవరకు జ్ఞానార్జనకు ప్రయత్నించవలసినదే. చిన్నమ్మాయి మాట తరువాత ఆలోచిద్దురు గాని:ఇప్పటికి దీనికైనా శాస్త్రోక్తప్రకారం చేయండి. పిల్ల లోపల భాగవతము చదువుచున్నది. ఒకసారి పిలుస్తాను. అని కుమార్తె నుద్దేశించి 'అమ్మా సరళా' అని ఒక కేక వేసెను. సరళ నిజముగ సరళస్వభావయే. ఆముద్దులు మూటగట్టు నూతనయౌవనాంకురితమందగమనముతో లోపల చదువుకొనుచున్న సరళ, తల్లికేకవినగానే వచ్చి విమర్శనాదృష్టితో తల్లిదండ్రుల నొకసారి చూచి "అమ్మా ఎందుకు పిలిచితివి?" అని ప్రశ్నించెను.

రామ:—అమ్మా మరేమీ తొందరలేదు. నీ వివాహవిషయమై నీతో కొంచము యోచింపవలెనని మీ నాన్నగారు పిలిపించమనగా పిలిచాను. మీ బావ శంకరశాస్త్రినిగూర్చి నీకు సదభిప్రాయమే యుండునని అనుకుంటాను.

సరళ:—అమ్మా ఇప్పు డప్పుడే అంత యోచించవలసిన అవసరమేమిటి. నాకింకా 16 సంవత్సరము లైనా గడవలేదుగదా.

రామ:—తల్లీ నీకు అనుభవముచాలదు. అయినప్పటికిని యుక్తవయస్కురాలవగు నీమనస్సు కనుక్కొని నీఉద్దేశానుసారముగా మేము చేయవలసిన కార్యమేగాని ఇంకొకవిధంగా ఎప్పుడూ జరగదు. వివాహమనునది ఒక పవిత్రమైన శాశ్వతసంబంధముకొరకు ఏర్పడిన పవిత్రకర్మగాని ఇంకొకటి, ఇంకొకటి గాదు. అటువంటప్పుడు నిదానముగా యోచించి మరీ తీర్మానించుకొనవలెను గాని రోడ్లమీద కనబడినంత మాత్రమున కేవలము మోహమునకు దాసులై పశుస్వభావమునకే ప్రాముఖ్యతనొసగి విలువైన జీవితమును వ్యర్థపరచుకొనువారు పరమదురదృష్టవంతులు. నీ కుటుంబముయొక్క విలువను గ్రహించి నీ మేనత్తగారి కుటుంబగౌరవమును యోచించి విద్యావంతుడును, సుగుణసంపన్నుడునూ అగు మీ బావను చేసుకొనుట కంగీకరింపుము.

శాస్త్రి:—నీవు వట్టి పిచ్చిదానవు సుమా. ముసలమ్మలాగ వంశమునకు ఏమో మహా ప్రాముఖ్యమిచ్చి మాటాడుచున్నావు. వరుని ప్రాముఖ్యతా, వంశము ప్రాముఖ్యతా మనకు ఎక్కువ కావలసినది.

రామలక్ష్మి:—ఈ విషయములో మీరు బాగా యోచించలేదనియే నా అభిప్రాయము. లేకపోతే ప్రపంచకజ్ఞానసంపన్నులును, చారిత్రవేత్తలును అగు మీరు గుర్తించకపోవటం ఆశ్చర్యముకదా. చివరకు ఫలవృక్షములలో సహితము సాంకర్యముచే ఫలించిన ఫలమునకు అసలైన జాతిఫలమునకు తారతమ్య ముండునని అందరికి తెలిసినదే. వంశములకు ప్రాముఖ్యతయిచ్చుట ఏదో రూపముగా ప్రతిఖండము లోనూ ఇప్పటికినీ వారిలోఉన్నట్లు మనకందరకూ విదితమే. అంతమాత్రముచేత ద్వేషభావమును పురికొల్పవలెనని దాని ఉద్దేశమా!? మంచివంశములో పుట్టినవాడని దుర్మార్గుడైనా చేసుకోవచ్చునని నా అభిప్రాయముకాదు. వరునివిషయములో మనమెంత ప్రాముఖ్యత యిచ్చెదమో, వంశవిషయములోనూ, సాధ్యమైనంతవరకూ అంత ప్రాముఖ్యత యీయవలసినదే. సత్సంతానముబడసి జీవితానందమును పొందవలెనంటే, తప్పకుండా అనుపూర్వికమైన వంశమర్యాదలను గూడ గుర్తించవలసినదే. తల్లిదండ్రుల పోలిక, లేక మేనత్తలు మేనమామలు పినతండ్రులు మొదలగువారి పోలిక, పిల్లలకు కలగటం వంశములో ఎవరికో ఉన్న కొన్ని దుర్వ్యాధులు తల్లిదండ్రులకు లేకపోయినను పిల్లలకు కలగటం మనం చూచుచు నేయున్నాము. పూజ్యపురుషులకు వ్యక్తిగౌరవం చూపించటం విధాయకమేగాని సత్సంతానమాత్రమునకు బద్ధమైన వివాహసంబంధము మాత్రము మొత్తముమీద ఆచరించతగ్గది కాదు. వంశగౌరవమును, వరునిప్రాముఖ్యము రెండునుకలిసిన సంబంధం ఉన్నప్పుడు ఇంక కావలసినదేమి.

సరళ:—అమ్మా! ఆంగ్లేయ భాషావైదుష్యమును పొందిననీవే ఇటువంటి మాటలాడటం వింతగాఉన్నది.

రామ:—ఇప్పు డందరికీ ఉన్న దుఃభిప్రాయమే అది. జ్ఞానసనార్జనకొరకు నూతన విజ్ఞానముకొరకు ఇతరభాషలను నేర్చుకొనినంతమాత్రమున మనలో ఉన్న సద్విషయములను గర్హించవలసినదని ఎక్కడైనా ఉన్నదా ఏమి. ఎక్కడికైనా భోజనమునకు వెళ్లామనిన, మనకు హితవగు వస్తువులనే తిందుము. వారికి మనకు ఆపూటతో సరిగాని శాశ్వతముగా అంటుకొవలసిన దేదియుఉండదు కాలవైపరీత్యము కొద్ది, నిజస్థితిని గమనించలేనంత దుస్థితికివచ్చితిమి. కాలక్రమేణ నిజము బయటపడకమానదు.

శాస్త్రి:—తల్లీ: విన్నావుకదా మీఅమ్మమాటలు. నీవునూ బాగా ఆలోచించి నీఉద్దేశమును స్పష్టముగా చెప్పుము.

సరళ:—నాన్నగారూ! నన్ను కని పెంచి పెద్దదానిగాచేసి విద్యాబుద్ధులు గరపి, నాక్షేమమే, మీక్షేమముగా రాత్రింబవళ్లు యోచించుచుండిన అనుభవజ్ఞులగు మీకు ప్రపంచానుభవమునను ఎంతయో దూరమందున్ననేనా చెప్పుట? తల్లి తండ్రులు మూర్ఖులైనప్పుడు, వారిసంగతే వారు నిర్ణయించుకొనుటకు అసమర్థులుగాన బిడ్డనుగూర్చి మాత్రము వారు తగిన నిర్ణయమునకు వచ్చుట అసంభవము. విజ్ఞులైన మీరు నన్నుగూర్చి నా భవిష్యజ్జీవనముగూర్చి యోచించునంత, నన్నుగూర్చి నేను యోచించలేనని నాకు గట్టినమ్మకము. అని కొంచెము నునుసిగ్గుదొంతరలు మొగమునకు ఒకవిధమైన వన్నె దోవ తల్లిదండ్రులకు నమస్కరించి వెళ్లిపోయెను.

౨

'కేశవా మీఅమ్మను ఇలా గొక్కసారి రమ్మను' అని తన మూడేండ్ల ముద్దుకుమారునితో తండ్రి శంకరశాస్త్రి చెప్పగానే గునగున పరుగులెత్తుకుంటూ తల్లి వద్దకువచ్చి, తన వచ్చీరాని అస్పష్టపుమాటలతో ఆ ఖబురును ఏలాగో అందజేసితే, నేమో గొప్పకార్యమును నిర్వహించినట్టు దిగ్విజయసూచకమైన ఒక గర్వపుచూపు చూచి చంకకెగబ్రాకెను. తల్లి సరళయు మాతృవాత్సల్య ముప్పొంగ బిడ్డను చంకవైచుకుని ముద్దులు కురిపించుకొనుచునే, భర్తవద్దకువచ్చి ఆయన చదువుకొనుచున్న హిందూపేపరును వెనకాలే తానూ చూచుటకు ప్రారంభించింది. ఆయన ఛప్పున పేపరు మూసేసి ఒకచిత్రమును ముట్టుకు కనబరచుచూ, "సరళా వీ రెవరో నీవు తెలిసికొగలవా? చూడు."

సరళ నిదానముగా చూచి ఇది మాచెల్లెలు కమలం. ఈయనెవరో నాకు తెలియదుగాని ఈపేరుకు తగిలించియున్న డిగ్రీలనుబట్టి, డాక్టరుగారని స్పష్టమౌతున్నది.

శంకరశాస్త్రి చిన్ననవ్వు నవ్వుతూ 'సరళా, నీవు కేవలము దురదృష్టవంతురాలవు సుమా. నీ చెల్లెలు చూడూ ఎంతచక్కగా బి య్యాల్ పట్టపరీక్షలో నెగ్గి పట్టాముపొందినదో. మొన్నమొన్ననే బంతులాట పోటీపరీక్షలో కప్పు గెల్చుకుంది. ఇప్పుడొక డాక్టరు'జోసఫు'సివిలుమారేజీ అక్టుక్రింద వివాహమైంది. ఒకరు లాయరు. ఒకరు డాక్టరు. ఏదీ నీకా అదృష్టము పట్టినదా? ఏదో నాబోటి అనామధేయుడ్ని చేసుకొని ఇంతదూరానికి రావలసివచ్చింది. నమ్మకములేకపోతే చూసుకో ఈ పేపరును' అని చేతికిచ్చెను. పాపము సరళమాత్రము దిగ్భ్రమను పొందిన మనస్సును సందరించుకుంటూ, బిడ్డను అక్కడున్న ఆయాచేతికిచ్చి, మరేమియు బదులు పలకలేక, మ్రాన్పడి ఆకాగితము ఆమూలాగ్రము చదివి ఒక వేడిసిట్టూర్పు వదలెను.

శాస్త్రి:—ఏమలాగు మిన్నొచ్చిమీదపడినంత విచారిస్తున్నావు? ఇప్పుడెన్ని అల్లాగు జరుగుచున్నాయి కావు! వాళ్ళు మాత్రము కలిసిఉన్నంత కాలము భార్యాభర్తలనిపించుకొని ఆస్తిపాస్తు లనుభవించుట లేదా? ఇందులోఉన్న ప్రత్యేక సదుపాయం ఒకటి నూతననూతనచవులు రుచిచూడవచ్చును. అని ఒక వినుదుమాటాడి ఏగసట్లు ఊరుకుండెను.

"మాఅమ్మ అనుకొన్నంతా అయినది. మొత్తము మీద యౌవనోద్రేకమునకే ఎక్కువ ప్రాముఖ్య మిచ్చినప్పుడు, కలిగేఫలితము ఆవిధముగా ఉండక తప్పదని మాఅమ్మ మొదటనే మానాన్నగారితో వాదించినది. మాతో తిరుగుచూ చిన్నప్పట్నించి అత్యంతమిత్రులుగాఉన్న మీపింతండ్రి కుమారుడు నారాయణకిమ్మని మాఅమ్మ ఎన్నివిధాలో అన్నది. తగినఇంటి అబ్బాయి, లక్షాధికారి, రూపసి, విద్యార్థి కుడు. మొన్నమొన్ననే ఖండాంతరములకు వెళ్ళి పరిశ్రమ విద్యలన్నీ ప్యాసుచేసి స్వయముగా ఒక పరిశ్రమాలయాన్ని స్థాపించి దక్షతతో నిర్వహిస్తు న్నాట్టగదా! ఇంతకూ విధివిధానాన్ని తప్పించువా రెవ్వరు."

"నన్నింకా పెళ్ళికి పిలుస్తారని అత్తారింటికి వెళ్ళి అల్లరికం కొన్నాళ్ళు చెలాయిద్దామని గంపంత ఆశతోఉంటే నాఆశలన్నీ ఒక్కసారి పోగొట్టిందని నాఘోషనాది. అయిందేమో అయింది. వాళ్లేమో చిలకాగోరింకల్లాగ ఈపాటికి సౌఖ్యపరంపరలో మునుగుతూ ఉంటారు. ఎందుకొచ్చిన ఆలోచన. ½ గంట దాటిపోతున్నది. 11 గంటలకు నా డిపార్టు మెంటును చూపించటానికి కొంతమంది పెద్దలను వెంటపెట్టుకొని మాలవ్యాపండితుడు వస్తాడట; నేను కొంచము త్వరగా వెళ్ళాలి."

"అన్నీ సిద్ధంగా నేయున్నవి. మీరు భోజనానికి వెళ్ళవచ్చును." అనిచెప్పి లేచి ఆయన బట్టలు వగయిరాలను సిద్ధపరచుటకు మేడమీదకుపోయెను.

* * *

నాడు సంక్రాంతిపండుగ సీతరామశాస్త్రిగారి గృహము భూలోకవైకుంఠమువలె, చూడ ముచ్చటగా ఉండెను. రామలక్ష్మమ్మ ఊపిరి విడుచుట కైనా తీరుబడిలేక వ్యవహరించుచున్నను, మొగము నందు మాత్రము హృదయాంతర్గతమైనకించ ఒకటున్న దని చూపరకు కనిపించకమానదు. ఆరోజు స్వయముగా ఆమెయే వచ్చినవారందరకు వర్ణవివక్షత లేకుండా భూరి అన్నప్రదానము చేయుచూ, వికలాంగులకు వస్త్రదానము గూడా జేయుచూ, సాక్షాత్తు కలియుగఅన్నపూర్ణాదేవివలె కానవచ్చుచుండెను.

ప్రపంచాన్ని, అందులో ముఖ్యముగా మన దౌర్భాగ్యభారత వర్షాన్ని, ఎదుర్కొన్న క్లిష్టపరిస్థితి ఈదారిద్ర్యమహాభూతమే గదా. ఆరోజంతయు ఆమె సత్కారములోనే లీనమైయున్నది. రాత్రి9-30గంట లైనది. సీతారామశాస్త్రి, కూతురు అల్లుడు మనమలూ అందరూ చుట్టూకూర్చునియుండ, తాంబూలము వేసుకుంటూ, పిల్లలచేత ఏవో చిన్నచిన్న మాటలను మాటాడించి సంతోషించుచూకూతురు సరళనుచూచి "అమ్మా! మీ అమ్మకు మనందరితో కలిసి కూర్చుం టకు ఇంకా తీరుబడికాలేదు కాబోలు. పెద్దదా తున్నకొద్దీ చాదస్తము ముదురుచున్నది సుమా." అని అనేసరికి, ఆమాటలను లోపలనుండి రామలక్ష్మమ్మ, చేతులను తువాలుతో తుడుచుకుంటూ విని "ఇదిగో నేనూ వస్తూనేయున్నాను. మీరు చాదస్తమని అన్నారే. అది నాకంటె మీకూ ఎక్కువగా ఉండ వలసినదే నా. అని అంటూ తానూ అక్కడకూర్చుని చిన్నకుమార్తె బిడ్డయగు 'జాను'ను దగ్గరకు తీసికుని, తలనిమురుచూ "అమ్మా జానీ! మీఅమ్మా, నాన్నా ఎందుకురాలేదు? ఈగృహ సంబంధమైన ఆనందములు వాళ్ళకంటికి నీచముగా కనబడెను కాబోలు! ఒక్కరోజైనా నల్గురముకలసి ఒకచోట అనుభవించుట కవకాశములేదట. కాలపరిస్థితి!" అనెను.

సీతారామశాస్త్రి:—ఇప్పటికా నీకు వెస్తతగిలి నది. అతనిని ఆఊరినుండి బదిలీచేసినందున పని విస్తారముగా ఉన్నదట. ఇంక అమ్మాయికూడా వాదించ వలసిన అర్జంటు కేసులు చాలా ఉన్నాయట: అందు

కోసరం నీ విలా అనుకుంటావనే. పిల్లల్ని మనిషి నిచ్చిపంపారు.

లక్ష్మమ్మ:-ఆహా ఇంత ఉభయులుకలసి ఒకచోట ఉండటానికి కూడా వీల్లేదు కాబోలు ఈఉద్యోగ ధర్మాన్ని ఖుచ్చుకుని; కాని జానూ! మీతమ్ముడేమిటి చదువుచున్నాడు.

జాను:— వాడు ఏమీ చెప్పిన మాటవినడు. మీరు మిక్కిలి దగ్గొకటి తీసుకుండా వాడ్ని బాధపెడు తున్నాది.

రామలక్ష్మి:— వాడి ననపలసిన పనేమిటి. ఇంటి వద్ద బాధ్యతవహించి బిడ్డలను జాగ్రత్తగా చూచుకుని వాళ్ళను క్రమమైన శిక్షలో ఉంచవలసిన తల్లి ఇతర వ్యాపకంలో లీనమైనప్పుడు వారెల్లాగు సరిగా ఉండగలరు? ఎంతమంది దాసదాసీజనములున్నను తల్లి పెంపకమునకు ఇతరుల పెంపకమునకు హస్తి మశకాంతరం లేడా భౌతికాభివృద్ధిలోనూ మానసికాభివృద్ధిలోనూ ఉండును. అది అటుండనిచ్చి అంత మంచిగాలిలోఉన్న ఎవరికీలేని ఆమాయదగ్గుకూడా ఎక్కడ్నించి వచ్చినదో ఖర్మము. అతను రాకపోయినమానె. కమలయైనావచ్చిన, నామనస్సుకు ఈవెత్తి ఉండకపోవును. ఎందుకు అనుకుని లాభమేమిటి?

శాస్త్రి:-ఏమిటండీ మీరును నిత్యం అలాగు అనుకోవటం తప్పని నాఅభిప్రాయము. అనవసరముగా వాళ్లమనస్సునూ నొప్పించినవారవుతారు. మీరు మిక్కిలి మీరిలా తరుచూ అనడంబట్టి వాళ్ళలో వాళ్ళకు పొరలుపుట్టడానికి అవకాశం ఉంటుంది. నేను మొన్న నీమధ్య వాళ్ళభార్యాభర్తలమధ్య కొంచం పొరలుపుట్టి, పెరిగి, డైవర్సువరకూ తదంగం ముదిరిందని కొందరివల్ల విన్నాను. నాపనిమీద నేనూ అక్కడికి వెళ్లడం తటస్థించింది గనక అప్పటికి నాకు తోచినట్టు కమలతో చెప్పివచ్చాను. ఇద్దరికీ గట్టిగా చెప్పడానికి వీల్లేదు. ఊరుకుందామన్న మనసొప్పదు. ఇప్పుడు ఖులాసగానేయున్నారు.

రామలక్ష్మమ్మ:—మనవార్ని "ఆలుమగలకయ్యం అద్దంమీద పెసరగింజ" అని సామెత పాడిచేవాళ్ళు. ఎటువంటివాళ్ళకు ఏదోసమయాన ఆమనస్సు తన యొక్క స్వభావచంచలాన్ని పైకుబికించకమానదు. తరువాత పస్తాయింపులు వాటంతటవేకలిగి సంసార యాత్ర తిరిగి సరళముగానే జరిగించుకుంటూ సంతోషముగా కాలక్షేపము చేసుకొనుటకు ప్రయత్నించేవారు.

శాస్త్రి:-ఇప్పుడుమాత్రము కలిగిన నష్టమేమిటి? మనవెఱ్ఱికాని, ఇదేమిటో ఒకసారి చూడండి. అని తనచేతి రుమాలులో ముడిచి పట్టుకొన్న మిలమిల మెరిసే వజ్రములు పొదిగిన ఒకపతకమును చేతిలో పెట్టి "మామామ ప్రొద్దుటే చూచినారు. మీకెక్కడా తీరుబడిలేనందున ఇప్పటివరకూ చూపించటం పడింది కాదు."

సరళ:—అబ్బా ఈయనకెంత జ్ఞాపకము. పని మల్లే దానిని గుర్తుంచుకుని ఇక్కడికి తీసికొచ్చినారు. ఏదో వాళ్ళ సంతోషం కొద్ది ఇచ్చినారుగా?, అందులో మనఘనతేముంది.

శంకరశాస్త్రి:—అది వాళ్ళ సంతోషం; అవులే, ఇది నాసంతోషం. అని ముసిముసి నవ్వులు నవ్వటం మొదలుపెట్టాడు.

సీతారామశాస్త్రి:—నీ వో గుడ్డికంటిదానవు. చత్వారంజోడు కావాలి. నేచెప్తానువిన్దూ దాని సంగతంతాను. నాల్గయిదునెలలక్రిందట పేపర్లో ఒకపోటీ పరీక్ష ప్రచురించబడిన సంగతి నీవేకదా నాకు చూపించినావు. ఆపరీక్షావిషయము "ప్రపంచంలో ఉన్న గొప్పమతము లన్నిటినీ పేర్కొని వాటి విజ్ఞానమునకూ హైందవ విజ్ఞానమునకూ ఉన్నసాట్లను పోలుస్తూ, అన్నిట్లోగల సారాంశమును స్వయముగా విమర్శించుట" అని నీకు జ్ఞాపకంఉందా? ఆవ్యాసము వ్రాసినవారికి 1,000 ఖరీదుగల వజ్రపతకమిచ్చెదమని కూడ అప్పుడేగదా ప్రచురించారు. దానికి మన సరళ చక్కనివ్యాసమువ్రాసి అహిందూ యూని

వర్సిటీవారి బహుమానము పొందిందట. మనము ఈసందట్లో రెండురోజులనుండి పేపరు చూడటం లేదు. వారంరోజులక్రిందటే ఆబహుమానము ఇచ్చి నారట. నాఉద్దేశము మాత్రము ఆ బహుమానము నీకురావలసినది సుమా. ఎందుకనీ, నీకుమాత్రే గనుక.

శాస్త్రి:—అందులో సగం నాక్కూడాను. నాతో సరిగా లాటిన్ నేర్చుకుని అందులోఉన్న పుస్తకాలను నాకన్నముందుగానే చదివి, అపరీక్షలు ప్యాసు చేసినది. అందుకనీ నాకు సగం.

లక్ష్మమ్మ:—(సంతోషసూచకమైన మొగముతో) బాగానేఉంది. మీమామా అల్లుండ్రి వేళాకోళములు.

కొట్టబోయేది పదకొండుగంటలు. మనమాటల సందట్లో చూడలేదు. పిల్లలు పాపము ఏలాగు పడుకున్నారో చూడండి. పదండి ప్రక్కమీదకు.

—:o:—

# జాబిల్లిసకియ

అధికార్ల సూర్యనారాయణరావుగారు

పాలుగారెడినీమోము ప్రాలుమాలి
వింతగాతోచునేమొ? జాబిల్లిసకియ!
క్రాగుతలపులనరుణ చక్రంబులోన
వన్నెచెడియిటులొంటిమై వగచెదేల?
మానవప్రపంచకంబెల్ల మాటుమణిగె
హోరుమనియెడు సంద్రంపుఘోషలెగసె,
మెల్లగా అర్ధరాత్రము మీరిపోయె!
నెచ్చెలీ! యింకనీవేల నిదురపోవు?
కనులదీర్చిన కాటుకకరగిజార
ఆననముచూపెనేల విషాదరేఖ?
మురువుగులికెడు ముత్యాలసరులుద్రెంచి
పారవైచితివేల విమానవీథి?
వెదకుచుండెదవిట్టులే ప్రియునిజూడ
మోముసీమనాశాకళల్ మురువుసూప?
చింతమునిగెదవెవ్వాని చెలిమిగోరి?
వెఱది!నీకేలగల్గె నీ విరహబాధ?
ప్రణయరాగామృతముగ్రోలు ప్రౌఢసతుల
మోదవాయువులందేలు పూవుప్రియుల,
వలపుతేనెలజవిచూచు పులుగుచెలుల,
గనెదవాలీల, ఫలమేమికలదెచెలియ?
మండియధికోష్ణమున దెల్లపడినమోము
తరుణి!పలుమారు జలనిధీదర్పణమున
జూచుకోనేల? శోకాన సోలిసోలి
నేత్రముల మంచుకన్నీరునించెదేల?
నిర్మలాకాశశీతలా నిలము లేచి
రవులుకొలిపెనో మదిననురాగవహ్ని?
శీతవాయువుపాలేల లేతమేను?
ఘనదుకూలంబు నొక్కింత కప్పరాదె!
నిన్నువిడనాడిపోయిన వన్నెకాని
నెమకి వేసారి నాజాడనిలచినావె
క్రొత్తశోకాలజ్వాలలు గుబులుకొనెనె?
మందభాగ్యుననుజూచి కుందెదేల?
వలపుప్రియులను మున్నెడబాపినావొ;
చెలువుప్రేమించి దోషమేసలిపినావొ,
మగువ! మనసారగోరిన మగలబాపి
యొండొరులజూచుకొని శాంతినొందవలసె!
నెచ్చెలీ! ధైర్యమేమియు నిలుపలేక
నెమ్మదిని గోరియున్నాను నీదుమైత్రి!
చెలిమివలచిననన్నీవు తలచుకొమ్మ!
ఎవరితోచెప్పుకోగల మిట్టిసొదలు?
ఆదరములేనిపతులకై వేదనపడు
హృదయములగాల్చుకార్చిచ్చువదలుటెట్లు?
శోకభారంబునాపుకోలేక మనము
చెలులమైనాము నేడు వెన్నెలపొలంతి!